గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా..

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

తిమ్మారావుపేటలో రోడ్ షో

వైరా టౌన్, ఏప్రిల్ 27 : నేను స్థానికుడిని.. మీ అందరి వాడిని.. నన్ను గెలిపిస్తే జిల్లాను మరింతగా అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. ఏన్కూరు మండలం తిమ్మారావుపేటలో శనివారం రాత్రి రోడ్ షో నిర్వహించగా.. ప్రజలు నీరాజనం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుసార్లు ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడంతోపాటు పార్లమెంట్ సాక్షిగా జిల్లా ప్రజల సమస్యలపై గళం విప్పానన్నారు. మళ్లీ గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. రాజకీయాల్లోకి రాకముందు నుంచే జిల్లా ప్రజలతో నాకు అనుబంధం ఉందన్నారు. పాల్వంచలో టెన్త్ వరకు, కొత్తగూడెంలో ఇంటర్ చదువుకున్నానని, తన తండ్రి నామా ముత్తయ్య పేరుతో ట్రస్ట్ పెట్టి పేదలు, బడుగు, బలహీన వర్గాల వారికి సేవా కార్యక్రమాలు చేశానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఉద్యమ నేత కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం పలువురిని కలిసి తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బానోతు మదన్‌లాల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు అభ్యర్థిస్తున్న నామా నాగేశ్వరరావు

తనిఖీలు ముమ్మరం చేయాలి

కలెక్టర్ గౌతమ్, ఎన్నికల పరిశీలకుడు సంజయ్

సత్తుపల్లి, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేసి అక్రమంగా మద్యం, డబ్బు రవాణాను అరికట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్, సాధారణ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ సంజయ్‌జీ కోల్టే అన్నారు. శనివారం మండల పరిధిలోని మేడిశెట్టివారిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఆంధ్రా నుంచి తెలంగాణకు, తెలంగాణ నుంచి ఆంధ్రాకు మద్యం, డబ్బు రవాణాను అరికట్టాలని సూచించారు. మండలంలోని కిష్టారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఏసీపీ అనిశెట్టి రఘు, సీఐ కిరణ్, తహసీల్దార్ యోగేశ్వరరావు పాల్గొన్నారు.

వైరా టౌన్, ఏప్రిల్ 27: వైరా నియోజకవర్గ కేంద్రంలో టీఎస్ గురుకుల పాఠశాలలో భద్రపరిచిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను ఖమ్మం పార్లమెంటు ఎన్నికల పరిశీలకులు సంజయ్, కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ కలెక్టర్ సత్యప్రసాద్, ఏసీపీ రెహమాన్ పరిశీలించారు. వైరా సాంఘిక సంక్షమ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్, కమిషనింగ్ రూమ్‌లను తనిఖీ చేశారు.

సత్తుపల్లి: స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకుడు

ఓటర్ స్లిప్పుల పంపిణీ వేగవంతం చేయాలి


ముదిగొండ: సిబ్బందితో అదనపు కలెక్టర్

తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణిలో..


చింతకాని: ఓటరు స్లిప్ అందజేస్తున్న ఆర్డీవో గణేశ్

ముదిగొండ, ఏప్రిల్ 27: ఓటర్ స్లిప్పుల పంపిణీ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. మండలంలోని వెంకటాపురం, గోకినేపల్లి గ్రామాల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్ అందేలా చూడాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంపీడీవో శ్రీధర్ స్వామి, తహసీల్దార్ వై రామారావు, ఎంపీవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 27: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. మండలంలోని కొక్కిరేణి, ఎర్రగడ్డలో ఓటు స్లిప్పుల పంపిణీని శనివారం ఆయన పరిశీలించారు. గ్రామస్తులకు ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఓటర్లందరికి స్లిప్పులు పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ రామకృష్ణ, డీటీ నర్సింహారావు, సూపరవైజర్ లక్ష్మణ్‌నాయక్, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

చింతకాని, ఏప్రిల్ 27: ప్రతి గ్రామంలో పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల స్లిప్‌లను సంబంధిత అధికారులు ప్రతి ఓటరుకు అందజేయాలని ఖమ్మం ఆర్డీవో జీ గణేశ్ అన్నారు. శనివారం మండలంలోని పందిళ్లపల్లి గ్రామంలో ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం పరిశీలించి కార్యదర్శి వైభోయిన నిఖిల్, బీఎల్‌వోలకు సూచనలు చేశారు. తహసీల్దార్ ఎన్ రమేశ్, ఏవో పల్లెల నాగయ్య, కార్యదర్శి నిఖిల్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

జూనియర్ న్యాయవాదులకు శిక్షణ

మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 27 : న్యాయ శాస్త్రంపై అధ్యయనం చేస్తూ జూనియర్ న్యాయవాదులు నిత్య విద్యార్థిగా ఉండాలని 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి కోర్టులో శనివారం ఐదేళ్లు నిండని జూనియర్ న్యాయవాదులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోవాలంటే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సివిల్, క్రిమినల్ కేసుల విచారణ ప్రక్రియను వివరించారు. కోర్టులు వాటి పరిధి, పనితీరు, కోర్టులు నడిపే సరళి, పరిభాషపై అవగాహన కల్పించారు. ముందుగా అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పి.లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తేళ్లూరి ఆదెయ్య(ఆడమ్స్)తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బుజ్జీ సాహెబ్, సీహెచ్ కృష్ణప్రసాద్, కె.ప్రసాదరెడ్డి, సెక్రటరీ ఎం.రమేష్, ఏపీపీ అబ్దుల్‌బాషా, వంకదారు రామకృష్ణ, మల్లెపూల వెంకటేశ్వరరావు, వెంకట్రావు, మహిళా ప్రతినిధి జినాదున్నీషా, మారేష్, విజయ్‌కుమార్, సాంబశివరావు, శిరీష, గుంట్రు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, అరుణ పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తకు సన్మానం

ఉమామహేశ్వరరావును సన్మానిస్తున్న అరుణ్

ఖమ్మం, ఏప్రిల్ 27: చంద్రయాన్-3 ప్రయోగం విజయంలో కీలక పాత్ర వహించిన ఇస్రో శాస్త్రవేత్త, ఖమ్మం వాసి వల్లూరు ఉమా మహేశ్వరరావును అంతర్జాతీయ ఆంగ్ల నిపుణుడు, మాజీ సైనిక ఉద్యోగి ఎస్ఎం అరుణ్ సన్మానించారు. ఖమ్మం శ్రీనగర్‌కాలనీలోని సైంటిస్ట్ ఉమామహేశ్వరరావు స్వగృహంలో అతడిని, అతడి తండ్రి కోటేశ్వరరావును శాలువా, జ్ఞాపికలతో శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ.. చంద్రయాన్-3 విజయం కోసం ఉమామహేశ్వరరావు అహర్నిశలూ చేసిన కృషి జిల్లాకే గర్వకారణమని అన్నారు. సైంటిస్ట్ అయిన అతడి సతీమణి మౌనిక సుప్రియ కూడా మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. డిగ్రీ లెక్చరర్ వీ.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుధారాణికి ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారం అందుకుంటున్న సుధారాణి

సత్తుపల్లి, ఏప్రిల్ 27 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి కేంద్రంగా సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి ఎంతోమంది పేదలకు, వితంతువులు, దివ్యాంగులు, దినసరి కూలీలు, విద్యార్థులు, యువతీ, యువకులు, వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుధారాణికి సూర్య చంద్ర కల్చరల్ ఆర్గనైజేషన్ ఉగాది పురస్కారాన్ని అందజేసింది. శనివారం హైదరాబాద్‌లో భారత వికాస్ పరిషత్ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **గుంటుపల్లి ఫణి కుమార్**, S/o : మల్లేశ్వరరావు, వయస్సు : 22 సం॥లు, వృత్తి : వ్యవసాయం, నివాసం : ఇ.నెం. 2-25, బేతుపల్లి శివారు సత్యనారాయణపురం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి: జిల్లా రిజిస్ట్రారు మరియు జిల్లా పరిషత్ ఖమ్మం, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రారు వారి ఇలాఖా, సత్తుపల్లి మండల పరిషత్, గంగారం గ్రామపంచాయితీ, బేతుపల్లి గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా సత్యనారాయణ పురం గ్రామంలో వున్న ఖాళీ నివేశన స్థల సర్వే నెం. 133/36/3 మింజుమలె 242 చ॥గ॥, **డాక్యుమెంట్ నెం. 993/2017** గల అట్టి ఆస్తికి సరిహద్దులు : **తూర్పు** : గ్రామ పంచాయితీ రోడ్డు, ఆస్తి కొలత 34 అడుగులు, **దక్షిణం** : కుంటుపల్లి కృష్ణ కుమారి గారి భూమి, ఆస్తి కొలత 64 అడుగులు, **పడమర** : గిఫ్ట్ పొందినవారి భూమి, ఆస్తి కొలత 34 అడుగులు, **ఉత్తరం** : దారి, ఆస్తి కొలత 64.5 అడుగులు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

ముగిసిన శిక్షణ

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27: టాస్క్, లేర్నెట్ స్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఐటీ హబ్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుపై 45 రోజులుగా ఇస్తున్న ఉచిత శిక్షణ శనివారంతో ముగిసింది. కోణార్క్ ఎండీ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో టాస్క్, లెర్నెట్ స్కిల్స్ సంస్థ ప్రతినిధులు హరేంద్రబాబు, గోపి పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

సత్తుపల్లి, ఏప్రిల్ 27 : ప్రపంచవ్యాప్తంగా కార్మిక పండుగ మే 1వ తేదీన వాడవాడలా అరుణ పతాకాలు ఎగరాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్ వద్ద మే డే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, తడికమళ్ల యోబు, సత్తార్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సోమయ్య, చలపతిరావు పాల్గొన్నారు.

అజయ్ సంతాపం

ఖమ్మం, ఏప్రిల్ 27: మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వ్యక్తిగత డ్రైవర్ ఎండీ అహ్మద్ అలీ (బాబా) సోదరి నూర్జహాన్ బేగం (76) శనివారం మృతిచెందారు. ఖమ్మం మాణిక్యనగర్‌లోని నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళి అలర్పించారు. కుటుంబీకులను ఓదార్చారు.

సంబాని పరామర్శ

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 27: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ టీచర్ కొప్పుల ప్రమీలాదేవి కుటుంబాన్ని మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్, జడ్పీటీసీ బెల్లం శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. ముందుగా ప్రమీలాదేవి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కుమారుడు, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పశువుల సంరక్షణ ముఖ్యం

మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 27 : జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డైరీ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ వెటర్నరీ డే వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ మాట్లాడారు. పశువుల మనుగడ, పర్యావరణం, జీవ వైవిధ్యానికి మధ్య గల సంబంధాన్ని వివరిస్తూ వెటర్నరీ డిపార్ట్‌మెంట్ పశుసంపదకు వాటికి కలిగే వ్యాధుల నుంచి సంరక్షిస్తూ మనుషులకు సంక్రమించకుండా అనేక చర్యలు తీసుకుంటారన్నారని వివరించారు. విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో పశువుల, పశువుల పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కరించే అంశాలుపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రామచందర్‌రావు, డైరీ సైన్స్ అధ్యాపకురాలు ప్రభావతి, వైస్ ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు రాంబాబు, బంగారి, పీర్ సాహెబ్, శ్రీధర్, మధు, శ్రీనివాస్, ఎం.మాధవి, రవికుమార్, విజయలక్ష్మి, శ్రీశాంత్, మల్లిక, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లు కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి

రఘునాథపాలెం, ఏప్రిల్ 27: కోర్టు పరిధిలో ఉన్న ఇంటిపై ఆక్రమణకు వచ్చి కూల్చివేసి, దాడులకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీ రోడ్డు నెంబర్ -415లో ఆక్రమణలో భాగంగా కూల్చివేతకు గురైన చేకూరి పద్మ ఇంటిని శనివారం పరిశీలించారు. రాజకీయ అండదండలతో కొందరు కాంగ్రెస్ నాయకులు ఈ దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. రాజకీయ వత్తిళ్లకు లొంగకుండా పోలీసులు బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు రెడ్డిబోయిన వరలక్ష్మి, ఝాన్సీ, నజీమా, విక్టోరియా, భద్రూనాయక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఓపెన్' పరీక్షలు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27: ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన పదో తరగతిలో 303మంది విద్యార్థులకు 245మంది హాజరై 58 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్‌లో 894మంది విద్యార్థులకు 772 మంది హాజరుకాగా 122మంది గైర్హాజరయ్యారని రెండు జిల్లాల కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు శనివారం తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఈవో సోమశేఖరశర్మ, డీఐఈవో కె రవిబాబు, ఏసీ దానా, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ వేడుకలు

రఘునాథపాలెం, ఏప్రిల్ 27: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం 'ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే' వేడుకలను శనివారం నిర్వహించారు. రఘునాథపాలెం సెక్టార్ పరిధి చిమ్మపూడి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో సూపర్‌వైజర్ కృష్ణకుమారి పాల్గొని పిల్లలకు, తల్లులకు ఏమేమి కావాలని, ఎలాంటి ఆటలు నేర్పించాలి అనే దానిపై వివరించారు. అనంతరం ప్రీ స్కూల్ ఆక్టివిటీస్, బాలింతలు, గర్భిణులకు అందించే పౌష్టికాహారం గురించి వివరించారు. తల్లులంతా తమ పిల్లలను అంగన్‌వాడీలకు పంపాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ శ్రీలక్ష్మి, ఆయా తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ముదిగొండ, ఏప్రిల్ 27: వ్యక్తిగత కారణాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముదిగొండకు చెందిన సాధినేని ఉపేందర్ (28) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఈ నెల 25న పొలానికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన ఉపేందర్ తన మోటర్ సైకిల్‌పై బయటికి వెళ్లాడు. అదే రోజు రాత్రి 9.30 గంటలకు ఉపేందర్ తన సోదరికి ఫోన్ చేసి తాను గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసకుంటున్నానని చెప్పి ఫోన్ పెట్టేసాడు. ఆమె వెంటనే తండ్రికి ఫోన్ చేసి చెప్పగా హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి ఉపేందర్‌ను ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ఉపేందర్ ఆరోగ్య పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతిచెందాడు. గ్రామానికే చెందిన ఓ వ్యక్తి నుంచి ఫోన్ రావటం వల్లే ఉపేందర్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మధిర, ఏప్రిల్ 27: మధిర మార్కెట్ యార్డు రైతువేదిక పక్కన గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వెల్దుర్తిపాడుకు చెందిన పున్నారావు (32) ఫంక్షన్‌కు వెల్దాము అని చెప్పి ముందుగా భార్యను పంపించాడు. తాను మధ్యాహ్నం వస్తానని చెప్పి ఫంక్షన్‌కు వెళ్లకపోవడంతో బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. వైన్‌షాపు పక్కన మార్కెట్‌యార్డులో ఉన్న స్థలాలు పరిశీలించగా యార్డులోని రైతువేదిక పక్కన విగతజీవిగా కనిపించాడు. మృతదేహంపై పెద్దపెద్ద గాయాలు కనిపించడంతో పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మధిర పట్టణ ఎస్సై సంధ్య బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

విద్యుదాఘాతంతో ఆవులు..

కారేపల్లి, ఏప్రిల్ 27 : విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతిచెందిన ఘటన శనివారం కారేపల్లి మండలంలో చోటుచేసుకుంది. సూర్యతండాకు చెందిన బానోత్ రాంచంద్, బాధావత్ హన్మ, బానోత్ మోతీలాల్‌కు చెందిన ఆవులు గ్రామ సమీపంలోని వరి పొలాల్లో మేతకు వెళ్లాయి. ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభం వైర్లు తెగి కిందపడి ఉన్నాయి. అటుగా మేతకు వెళ్లిన ఆవులు కరెంట్ సరఫరా అవుతున్న విద్యుత్ వైర్లను తాకి అక్కడికక్కడే మృతిచెందాయి. గమనించిన స్థానికులు సంబంధితశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ ఏఈ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకున్నారు. ప్రమాదంపై దర్యాప్తు చేసి మృతిచెందిన ఆవులకు పంచనామా చేశారు. చనిపోయిన ఒక్కొక్క పశువుకు రూ.40 వేల చొప్పున యజమానికి విద్యుత్ శాఖ పరిహారం అందజేస్తుందని తెలిపారు.

సుబాబుల్ తోట దగ్ధం

మధిర, ఏప్రిల్ 27: మండలంలోని ఖమ్మంపాడులో సుమారు 10 ఎకరాల సుబాబుల్ తోట ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన శనివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గడసందుల వెంకటేశ్వర్లు, బండి సీతారామయ్య, కల్యాణపు పూర్ణయ్యతో పాటు, మరికొంత మంది రైతులు సాగు చేసిన సుబాబుల్ తోట అగ్నికి అహుతైంది. సుమారు రూ.10 లక్షలకు నష్టం జరిగినట్లు రైతులు పేర్కొన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

కేసీఆర్ పర్యటనను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30వ తేదీన బీఆర్ఎస్ అధినేత, తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తల్లాడలో నిర్వహించనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. శనివారం ఆయన సండ్ర క్యాంపు కార్యాలయంలో జరిగిన బీఆర్ఎస్ నాయకుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, అమరవరపు కృష్ణారావు, మాధురి మధు, నరుకుళ్ల శ్రీనివాస్, చాంద్‌పాషా, గఫార్, నడ్డి ఆనందరావు, మట్టా ప్రసాద్, మరికంటి శ్రీను, రఫి, అంకమరాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెనుబల్లి, ఏప్రిల్ 27 : భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు స్వగ్రామం గంగిదేవిపాడులో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే గౌస్, నాయకులు మందడపు అశోక్‌కుమార్, గునిగుంట్ల లక్ష్మీనారాయణ, తీగల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

వేంసూరు, ఏప్రిల్ 27 : గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు పని ప్రదేశంలో ఎండ వేడిమి, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రమేశ్ సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా పని ప్రదేశాల్లో ఎండ వేడిమిని తట్టుకునేందుకు ప్రభుత్వం అందించిన టెంట్లను ఆయా గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం 25 పంచాయతీలకు టెంట్లు అందించడం జరిగిందని, ఆయా గ్రామ పంచాయతీలకు అందజేసి పని ప్రదేశంలో కూలీలకు నీడనిచ్చే విధంగా వేయాలని సూచించారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 27: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశం ఎన్నికల నేపథ్యంలో నామమాత్రంగా సాగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. పలు శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. రెండు మూడు ప్రభుత్వ శాఖల సమీక్ష తర్వాత గంట సమయంలోపే సమావేశాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేషాద్రి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పలు శాఖాధికారులకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. ఎంపీపీ బోడ మంగీలాల్ మాట్లాడుతూ.. గ్రామాల్లో కూలీలందరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ బెల్లం శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బుద్ద వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

కళావతి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

మధిర, ఏప్రిల్ 27: మధిర ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న పీఆర్‌టీయూ సభ్యురాలు, మధిర మండల మహిళా ఉపాధ్యాయురాలు ఎన్ కళావతిని శనివారం పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రవి కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆర్ రంగారావు మాట్లాడారు. కళావతి 38 సంవత్సరాల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు ఎన్ కృష్ణమోహన్, రాష్ట్ర బాధ్యులు డీ వెంకటేశ్వరరావు, ఎస్‌కే మదార్, నాయకులు బీ వెంకటేశ్వరరావు, కోట జయరాజు, ఆర్ బ్రహ్మారెడ్డి, కొమ్ము శ్రీనివాసరావు, సీహెచ్ రవికుమార్, జీ కిరణ్‌కుమార్, బూస కోటేశ్వరరావు, కొలగాని ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 27: మండలంలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెం, బచ్చోడు, రాజారంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో శనివారం జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల విస్తృత తనిఖీలు నిర్వహించారు. వివిధ రకాల రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వ అనుమతి లేని ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి ఎన్.సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెరీర్‌పై అవగాహన సదస్సు


సైంటిస్టులను సన్మానిస్తున్న విద్యార్థినులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 27: మండలంలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కెరీర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఇస్రో సైంటిస్టు మౌనిక సుప్రీయ విద్యార్థులకు డీఆర్‌డీవో, ఇస్రో అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ కాట్రెపల్లి నవీన్‌బాబు, అకాడమీ డైరెక్టర్ వెంకటరమణ, ప్రిన్సిపాల్ గోపాల్, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 27: జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ట్రాన్స్‌జెండర్స్‌కు కలెక్టర్ కార్యాలయంలో ఓటుపై అవగాహన కల్పించారు. అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కే శ్రీరాం, జిల్లా సంక్షేమ అధికారి కే రాంగోపాల్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు.

మదన్‌లాల్ నివాళి

రఘునాథపాలెం, ఏప్రిల్ 27: మండలంలోని ఈర్లపూడి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్రావణం సీతారామయ్య (72) శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. సీతారామయ్య నివాసానికి వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అతడి కుటుంబీకులకు పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుడు జావేద్, కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు తదితరులు కూడా నివాళులర్పించారు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

CHANGE OF NAME

★I, **KILUMU RAMALAKSHMANA REDDY** CHANGED MY NAME AS **KILUMU RAMA LAXMANA REDDY,** S/o. KILUMU SRINIVASA REDDY, R/O. Q.NO. T2-5H, BABU CAMP, KOTHAGUDEM - 507101, BK DIST.
KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు



సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616